క్లుప్తంగా

ఘనంగా ఆడారి తులసీరావు జయంతి



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో డెయిరీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు 100 మంది పాల్గొని, రక్తదానం చేశారు. కిమ్స్ ఐకాన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, సీనియర్ జనరల్ మేనేజర్ విజయారావు, ప్లాంట్ జీఎం వెంకట్, మార్కెటింగ్ జీఎం, పీఆర్వో అదపురెడ్డి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

14న సీతారాముల పరస మహోత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో కొలువైయున్న శ్రీ సీతారాముల పరస మహోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన జరిపించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ కరపత్రాన్ని శ్రీ సీతారాముల ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పరస మహోత్సవాలను పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.సుబ్రహ్మణ్యం, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్మిడి రామాంజనేయుడు, ప్రధాన కార్యదర్శి వంగలపూడి గోపి, కోశాధికారి పెట్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

గాజువాక పరస నేడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

గాజువాక: ఈ నెల 2న బీసీ రోడ్‌లో నిర్వహించనున్న శ్రీ సీతారామ ఉమా రామలింగేశ్వర స్వామి పరస (గాజువాక పరస)ను కుల, మతాలు, పార్టీలకతీతంగా జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పరస పోస్టర్‌ను నిర్వాహకులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరస సందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరస నిర్వహణకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మద్ది శంకరరెడ్డి, పిల్లా శంకరరావు, గంధం శ్రీను, దొడ్డి రమణ, గోమాడ వాసు, గూన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, జెడ్సీలకు ఘన సత్కారం



ఎమ్మెల్యే, జెడ్సీలను సత్కరిస్తున్న నాయకులు

గాజువాక: జీవీఎంసీ 73వ వార్డులో రూ.4.80 కోట్లతో అభివృద్ధి పనులను మంజూరు చేసినందుకు గాను ఆ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు.. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని, జెడ్సీ పి.సింహాచలంను ఘనంగా సత్కరించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే, జెడ్సీలకు పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బీసీ రోడ్డును రూ.2 కోట్లతో అభివృద్ధి చేయడానికి శంకుస్థాపన చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్పుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, ములకలపల్లి వెంకటేష్, ప్రమీల, రామలక్ష్మి, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు..కానుక

ప్రపంచాన్ని మార్చే శక్తి ఒక్క విద్యకే ఉందని భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి.. ప్రపంచంతో పోటీ పడే పరిస్థితి మన విద్యార్థులకూ రావాలనే సత్సంకల్పంతో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏ ప్రైవేట్ స్కూల్ విద్యార్థికీ తగ్గని విధంగా సౌకర్యాలు సమకూర్చారు. పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు విద్యార్థులకు ఏటా విద్యా కానుక రూపంలో యూనిఫాం, బుక్స్, షూ, బ్యాగ్ వంటివి అందిస్తూ వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



జగనన్న విద్యాకానుక కిట్లతో విద్యార్థులు (ఫైల్)

- ఏటా పాఠశాలలు తెరిచే నాటికే కిట్లు సిద్ధం
- చక్కని యూనిఫాం, షూ, బ్యాగ్‌తో బడికి వెళ్తున్న విద్యార్థులు
- పిల్లల తల్లిదండ్రుల్లో ఆనందోత్సాహాలు

గాజువాక: ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక వారి అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి ఎంతో దోహదం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో విద్యార్థులతో పోటీ పడే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. విద్యా ప్రమాణాలను, ఫలితాలను మెరుగుపరచడం, విద్యార్థులకు ఉన్నతస్థాయి చదువును అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఆరు రకాల వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లు అందించారు. ఏటా వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేనాటికి ఆ కిట్లను విద్యార్థులకు అందే విధంగా ఏర్పాట్లు చేశారు. యూనిఫాం కుట్టించుకోవడానికి అయ్యే ఖర్చును కూడా ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటంతో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, బ్యాగ్‌తో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

కిట్‌లో వస్తువులు

- ప్రతీ విద్యార్థికి మూడు జతల యూనిఫాం
- పాఠ్య పుస్తకాలు
- నోట్ పుస్తకాలు
- బూట్లు
- రెండు జతల సాక్సులు
- స్కూల్ బ్యాగ్, బెల్ట్

వీటితో పాటు ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. పాఠ్యపుస్తకాలను బైలింగ్వల్‌గా ప్రింట్ చేసి అందిస్తోంది. ఒక పేజీలో ఇంగ్లిష్‌లో కంటెంట్ ఉంటే మరో పేజీలో తెలుగులో కంటెంట్‌ను అందిస్తోంది. ఒక్కో కిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ.2,500 ఖర్చు చేస్తోంది.

జగనన్న విద్యాకానుక లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	కానుక విలువ (రూ.)
2019-20	8610	1,24,44,237
2020-21	9182	1,30,70,747
2021-22	9592	1,37,80,306
2022-23	10071	1,38,57,527
2023-24	10589	1,45,70,000
ఐదు విడతల్లో ఖర్చు చేసిన మొత్తం		రూ. 6,77,22,817



నడుపూరు హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ (ఫైల్)

ప్రైవేట్ స్కూల్లో వీటికి రూ.15వేలు ఖర్చయ్యేది



మా అమ్మాయి అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. 7వ తరగతి వరకు ప్రైవేట్ స్కూల్‌లో చదివించాం. నా భర్త ప్రైవేట్ కార్మికుడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మా అమ్మాయిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం. జగనన్న విద్యాకానుక ద్వారా మా అమ్మాయికి బ్యాగ్, యూనిఫాం, షూ, బుక్స్ ఇచ్చారు. ప్రైవేట్ స్కూల్‌లో ఇవి కొనడానికి కనీసం రూ.15వేలు ఖర్చయ్యేది. ఇప్పుడవి ఉచితంగా అందించడంతో పాటు అమ్మ ఒడి కింద జగనన్నే మా ఖాతాలో డబ్బులు వేస్తున్నారు. మాకు ఆర్థికంగా చాలా భారం తగ్గింది. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. – రేవతి, విద్యార్థిని తల్లి, అక్కిరెడ్డిపాలెం

సీఎం రుణం తీర్చలేనిది



మా కుమార్తె సహస్ర లలిత నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. కూలికి వెళ్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి మాది. మా అమ్మాయిని చదువు మాన్పించి పనులకు తీసుకెళ్లాలనుకున్నాం. అమ్మ ఒడి, విద్యా కానుక వంటి పథకాలు అందడంతో బడికి పంపించగలుగుతున్నాం. పాఠశాలలనూ ఎంతో అభివృద్ధి చేశారు. మా పిల్లల చదువు బెంగ లేకుండా చేశారు. ఏం ఇచ్చినా ఆయన రుణం తీర్చుకోలేనిది. – ఎ.సత్యవతి, విద్యార్థిని తల్లి, పెదగంట్యాడ

ఆర్థిక భారం తగ్గించారు



విద్యార్థుల కోసం సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎంతో మేలు జరుగుతోంది. విద్యాకానుక ద్వారా మాలాంటి వారికి ఆర్థిక భారం లేకుండా చూశారు. గతంలో మా పిల్లల చదువు కోసం ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు మా అబ్బాయికి అవసరమైన యూనిఫాంషూ, బ్యాగ్, పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారు. కుట్టుకూలి కూడా ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా అందజేస్తున్నారు. మా బాబు బాగా చదువుకుంటున్నాడు. – శంకరరావు, విద్యార్థి తండ్రి, చినగంట్యాడ

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు



లంకా మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సమన్వయకర్త చందు, జెడ్సీ సింహాచలం

గాజువాక: వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను గాజువాకలో శుక్రవారం నిర్వహించనున్నారు. దీనికోసం పాతగాజువాక దరి లంకా మైదానంలో జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. పది వేల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరవుతారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), జోనల్ కమిషనర్ పి.సింహాచలంతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, పొదుపు సంఘాల సభ్యులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చందు కోరారు.

సీఐల బాధ్యతల స్వీకరణ



న్యూ పోర్టు సీఐ దాలిబాబు

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐగా గింద్రి దాలిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నేర ప్రవృత్తి కలిగిన వారు తమ పంథా మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పనిచేసిన సీఐ వి.ఎ్రంనాయుడు దువ్వాడ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐగా శ్రీనివాసరావు



సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐగా పి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సూర్య నారాయణ వీఆర్‌కు వెళ్లడంతో, నగర పోలీస్ కమిషనరేట్ నుంచి శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నామని తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన



వాహనదారులకు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో అధికారులు

గాజువాక: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గాజువాక రవాణా శాఖ అధికారులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాజువాక పోలీసులతో కలిసి పాతగాజువాక జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రహదారి భద్రతపై ప్లకార్డులను ప్రదర్శించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు, కార్లు నడిపేవారు సీట్ బెల్టులను ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీవో జయప్రకాష్, ఇన్‌స్పెక్టర్లు బాలాజీరావు, ప్రవీణ్ కుమార్, కె.శ్రీనివాస్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 14,190 పింఛన్ల పంపిణీ



70వ వార్డులో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

గాజువాక: గాజువాక జోన్‌లో వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ జోరుగా సాగింది. వలంటీర్లు తెల్లవారేసరికే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.3వేల చొప్పున పెన్షన్ నగదును పంపిణీ చేశారు. గాజువాక జోన్‌లో మొత్తం పెన్షన్ లబ్ధిదారులు 31,534 మంది కాగా, వారిలో తొలిరోజు 14,190 మందికి పెన్షన్‌ను అందజేసినట్టు జీవీఎంసీ యూసీడీ విభాగం సహాయ ప్రాజెక్టు అధికారి ఎల్.రాము తెలిపారు. కాగా, పెన్షన్‌ను ఐదు రోజులపాటు పంపిణీ చేయనున్నారు. తొలిరోజు 45 శాతం పెన్షన్‌లను పంపిణీ చేశామని, మూడు రోజుల్లోనే మొత్తం లబ్ధిదారులకు పంపిణీ పూర్తవుతుందని ఏపీడీ తెలియజేశారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గోవిందరావుకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ సాయి సుమ

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

పెదగంట్యాడ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగికి పెన్షన్ అందించి, ప్రశంసలందుకున్నారు వలంటీర్ సాయి సుమ. 74వ వార్డు దళ్లివానిపాలేనికి చెందిన పూడి గోవిందరావు అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఇంటికి వచ్చి పెన్షన్ తీసుకునే పరిస్థితి లేకపోవడంతో వలంటీర్ సాయి సుమ, ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు. దీంతో గోవిందరావు కుటుంబసభ్యులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు.

డాల్ఫిన్ హిల్స్ పరిశీలన



యారాడ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్

పెదగంట్యాడ: మిలాన్–2024ను పురస్కరించుకుని యారాడ ప్రాంతంలోని డాల్ఫిన్ హిల్స్, యారాడ బీచ్ తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, నేవల్ కమాండర్ సివిల్ మిలిటరీ లైజన్ ఆఫీసర్ కిశోర్‌తో కలిసి యారాడ ప్రాంతంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మిలాన్–2024 సందర్భంగా 50 దేశాల ప్రతినిధులు, అతిథులు, నేవల్ అధికారులు అధిక సంఖ్యలో రానున్నారని డాల్ఫిన్ హిల్స్ నుంచి యారాడ బీచ్ వరకూ హెల్త్ ట్రెక్, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆయా ప్రదేశాల్లో త్వరితగతంగా పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ సింహచలం, ఈఈ రామ్మోహన్‌రావు, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు అందిస్తున్న నాగిరెడ్డి, చందు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అగనంపూడి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. 85వ వార్డు దిబ్బపాలెం వార్డు సచివాలయ పరిధిలోని గ్రామాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లంకెలపాలెం యూపీహెచ్‌సీలో గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, దీర్ఘ కాలిక రోగాలు గుర్తించడం, తద్వారా సరైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో దిబ్బపాలెం పరిసర కాలనీల నుంచి 362 మందికి వైద్య సేవలు పొందారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యలత ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో జెడ్సీ పొందూరు సింహాచలం, వైఎస్సార్‌సీపీ గాజువాక మండల కో–ఆర్డినేటర్ బొడ్డ గోవింద్, జేసీఎస్ కో–ఆర్డినేటర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు సచివాలయ కన్వీనర్లు బొట్ట గంగరాజు, చంద్రమౌళి, వైద్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గాజువాక: సాక్షి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్పెల్ బీ, మ్యాథ్ బీ పోటీల్లో స్థానిక చలపతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 8వ తరగతికి చెందిన వి.మహాశ్విన్ ఇంగ్లిష్‌లో.. 7వ తరగతికి చెందిన బి.నవనీత్ మణికంఠ, 8వ తరగతికి చెందిన కె.నిఖిల్ మ్యాథ్ బీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డీన్ కె.గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎ.బాలరెడ్డి, ప్రిన్సిపాల్ లీలా రత్నకుమారి, ఏవో శ్రీధర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

1085వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1085వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

16న భెల్ కార్మికుల సమ్మె



భెల్ హెచ్ఆర్ హెడ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాలు

అక్కిరెడ్డిపాలెం: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా భెల్ (హెచ్‌పీవీపీ) కార్మిక సంఘాలు కూడా సమ్మెలో పాల్గొనున్నట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సంస్థ హెచ్ఆర్ హెడ్ ఎంవీఎస్ఎన్ రాజుకు ఇంటక్, సీఐటీయూ కార్మిక సంఘాల ప్రతినిధులు పరిపాలనా భవనంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ల ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, జీటీపీ ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, సీహెచ్.వి.ఎస్.నారాయణ, జి.అచ్చన్న, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవా సంఘాల వితరణ



మృతురాలి కుటుంబానికి సరకులు అందిస్తున్న పద్మ మార్కండేయ సేవా సంఘం సభ్యులు

అగనంపూడి: ఆపదలో ఉన్నవారికి చేయూతనిచ్చి ఆదుకున్నారు సేవాసంఘాల ప్రతినిధులు. 79వ వార్డు పాత అగనంపూడిలో నివాసముంటున్న చోడవరపు గణేష్ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆ కుటుంబానికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బియ్యం, నిత్యావసర సామగ్రి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

- అగనంపూడికి చెందిన గుడే లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె కుటుంబానికి అగనంపూడికి చెందిన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం నెలకు సరిపడా బియ్యం, సరకులు అందించింది. సేవా సంఘం ప్రతినిధి గంధోళి నరసింగరావు, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో వీటిని జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు పప్పు రాజారావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కొలిపాక అప్పారావు, బేతా హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

4న త్యాగరాజ ఆరాధనోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విస్కా కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా), ఉక్కునగరం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉక్కు క్లబ్ ఎంపీ హాల్లో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాస శర్మ, ప్రధాన కార్యదర్శి ఎ.వి.ఎ స్.ఎస్. శర్మ తెలిపారు. గురువారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో భాగంగా విస్కా నలభై వసంతాల కార్యక్రమాల సావనీర్ ఆవిష్కరణ, విస్కా పూర్వ కార్యదర్శి ఆలమూరు కేశవరావుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో విస్కా కార్యవర్గ సభ్యులు జి.ఎస్.ఆర్. కిశోర్, డి.దుర్గాప్రసాద్, ఈరంకి శ్రీనివాస్, శివప్రసాద్, డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.49.70 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందుతో కలసి గురువారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ లక్ష్మీపురం కాలనీలో రూ.19.80 లక్షలతో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు.. తారకరామనగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తిరుమల నగర్‌లో రూ.19.90 లక్షలతో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, వడ్లపూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు బయోమెట్రిక్ అవస్థలు

ఉక్కునగరం: ఉద్యోగుల అటెండెన్స్ క్రమశిక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇటీవల ప్రారంభించిన బయోమెట్రిక్ మెషీన్లు ఉద్యోగులను తిప్పలు పెడుతున్నాయి. మెషీన్లు సక్రమంగా పని చేయకపోవడంతో రోజూ చాలామంది ఉద్యోగుల అటెండెన్స్ నమోదు కావడం లేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు గత నెల 12 నుంచి ప్లాంట్‌లోని కొన్ని విభాగాల్లో బయో మెట్రిక్, ఫేస్ స్కానర్ పద్ధతిని ప్రారంభించారు. మొదటి నుంచి అడపాదడపా మెషీన్లు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. కొంతమందికి ఉదయం వేలిముద్ర పడితే, సాయంత్రం పడేది కాదు. గత నెల 31 వరకు ట్రయల్ కావడంతో, ఉద్యోగులు అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఫిబ్రవరి 1 నుంచి పూర్తిగా బయోమెట్రిక్ పైనే అటెండెన్స్ అని స్పష్టం చేయడంతో ఉద్యోగులందరూ అప్రమత్తమయ్యారు. తీరా చూస్తే మెషీన్లు మొరాయిస్తున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఆ మెషీన్ల దగ్గర పదేసి నిమిషాలు వేలిముద్ర కోసం అగచాట్లు పడ్డారు. అయినప్పటికీ వేలిముద్ర పడకపోవడంతో వారు హెచ్ఆర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వాటి స్థానంలో ఫేస్ స్కానర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. మలిదశలో జరిగే ప్లాంట్ లెవెల్ బయోమెట్రిక్ విధానంలో ఇటువంటి సమస్యలు తలెత్తితే, కష్టమేనని ఉద్యోగులు భావిస్తున్నారు.

దువ్వాడ సీఐకు సత్కారం

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వీవీసీఎం ఎర్రన్నాయుడిని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. సీఐ నాయుడు మాట్లాడుతూ దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, సహకారం అందించాలని కోరారు. అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.